



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

గురువారం 04 సెప్టెంబర్ 2025 పేజీలు 07


### గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ

## సమర్థవంతంగా నిర్వహించాలి

**- రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్**

**మంచిర్యాల ప్రతినిధి,సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**



గ్రామీణ స్థాయిలో పరిపాలన సులభతరం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలన అధికారుల నియామకం సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, నియామక ఉత్తర్వుల పంపిణీ, మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమైనదిగా భావించి తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇన్చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించాలని తెలిపారు.

మిగితా. 2లో

### సంక్షేమ అభివృద్ధి పనులను

## వేగవంతం చేయాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలి
- దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలి
- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే







**ఆసిఫాబాద్ ప్రతినిధి,సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ పథకం ఎ.పి.ఓ.లు, సెర్ప్ ఎ.పి.ఎం.లు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, 100 శాతం ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్ మెంట్ నిర్మాణం ఆలస్యం చేసే వారిని గుర్తించి బ్యాంకు లింకేజీ, మండల సమాఖ్య ద్వారా ఇండ్ల నిర్మాణం ప్రారంభించని వారికి లక్ష రూపాయలు రుణము అందించే విధంగా చర్యలు తీసుకోవాలని,

మిగితా.. 2లో



### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## అందించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జైపూర్, సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన, ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె దవాఖాన కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని,



వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రహదారి నుండి ఆసుపత్రికి వచ్చే అటాచ్ రోడ్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు చేయాలని తెలిపారు. (మిగితా. 2లో )

### మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు

## తోడ్పాటు అందించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

2లో



### కాళేశ్వరం ప్రాజెక్టు పై

## లక్ష కోట్లు దుర్వినియోగం

**బేల, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్ :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్లు దుర్వినియోగం చేసిన బిఆర్ఎస్ నాయకులకు కాళేశ్వరం నివేదికతో భయం పట్టుకుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కాదు బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా యూరియా కొరత ఉందన్న విషయం బిఆర్ఎస్ నాయకులకు తెలవదాని మండిపడ్డారు. ప్రజలందరూ గమనిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి నాక్లే రాందాస్,మార్కెట్ వైస్ చైర్మన్ విలాస్ పటేల్,సామ రూపేష్ రెడ్డి, సంజయ్ గుండావర్, టాక్రె సాగర్, కన్నె రాజు తదితరులు పాల్గొన్నారు.



## 20 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

**- 13 మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఐదు మోటర్ సైకిల్లు,రూ 82,120 నగదు స్వాధీనం - డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో కమిటీ సభ్యులు నిర్వహించుకోవాలని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదు అని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలియజేశారు. గత రాత్రి స్వస్తిక్ జిన్నింగ్ నందు ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక దాడి చేయగా 9 మంది పేకాట రాయలను అరెస్టు చేయడం జరిగిందని వారి వద్ద నుండి పేకాట ముక్కలు ఒక కారు, ఐదు మోటర్ సైకిల్లు ,8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వారి



వద్ద 53,590 నగదు లభించిందని వారిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. మంగళవారం మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్ నగర్ నందు గణపతి మండల్ వద్ద ముగ్గురు పేకాట ఆడగా సంఘటన స్థలంలో పట్టుకున్నట్టు వారి వద్ద నుండి పదివేల రూపాయలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. (మిగితా2 లో )

# గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## - రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్

**మొదటి పేజీ తరువాయి...**

కార్యక్రమానికి హాజరయ్యే నియమించబడిన గ్రామ పాలన అధకారులను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లా నుండి హైదరాబాద్ లోని హైటెక్ సిటీ కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సకాలంలో నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలన అధికారులుగా నియమించబడే వారికి తమ స్వగ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వకూడదని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతులకు నిర్దిష్ట పరిస్థితులలో విశేష మినహాయింపులు ఇవ్వవచ్చని, సంబంధిత అంశాలను జిల్లా స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ప్రతి క్లస్టర్ కు తగిన అభ్యర్థిని నియమించేందుకు జిల్లా కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హైదరాబాద్‌లో జరగనున్న నియామక ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు చెందిన గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 8.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## - ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి - గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలి - దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలి

## - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**మొదటి పేజీ తరువాయి...**

విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పి.వి.టి.జి లకు 100 శాతం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని,అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. పనుల జాబితా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్వాడి కేంద్రాల భవనాలు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ షెడ్, గోట్ షెడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రహదారులపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. గుంతలలో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంపొందించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. వనమహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, హౌసింగ్ పి.డి.తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు

# తోడ్పాటు అందించాలి

## - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కుందారపు రాణికి 10 లక్షల రూపాయలతో మంజూరైన మొబైల్ చేపల విక్రయ వాహనం యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు 4 లక్షల రూపాయల సొంత నిధులు, 6 లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ నిధులతో సంచార చేపల విక్రయ వాహనం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని, మహిళలు వ్యాపారాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన పొందడమే కాకుండా కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు యశోద, యాదగిరి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. కుందారం




గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 20 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

## - 13 మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఐదు మోటర్ సైకిల్లు,రూ 82,120 నగదు స్వాధీనం - డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం శాంతినగర్ నందు గణపతి మండప పరిసర ప్రాంతం వద్ద పేకాట ఆడుతుండగా 8 మంది పై కేసు నమోదు అయిందని వారి వద్ద నుండి రూ 18,520/- నగదు మూడు మొబైల్ ఫోన్లో స్వాధీనం చేసుకొని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు.మూడు కేసుల నందు గణపతి చందా పేరుతో,కేటీ పేరుతో, గణపతి మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.ప్రతిరోజు మండపాల వద్ద క్లస్టర్ మరియు సెక్టర్ పోలీస్ అధికారులు పరిశీలిస్తూ ఉంటారని, జిల్లా పోలీస్ యంత్రాంగానికి పూర్తి సమాచారం అందుతుందని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సూచనలిస్తూ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న ఇల్లు, భవనాల యజమానులకు ఆర్డీవోకు సిఫార్సు చేసి, సెక్షన్ 152 బిఎన్ఎస్ఎస్ ప్రకారం వారి ఇళ్ళను భవనాలను జప్తు చేయడం జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించరాదని తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో కమిటీ సభ్యులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన యెడల వారిపై ,గణపతి మండపాల కమిటీ సభ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. మండప కమిటీ సభ్యులు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని తెలియజేశారు. గణపతి నిమజ్జన ఉత్సవాలలో అధిక శబ్దం వచ్చే డీజే లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా కనులకు హాని చేసేటువంటి లేజర్ లైట్లు, డిస్కో లైట్లు అదే విధంగా పేపర్ చెల్లె యంత్రాలకు అనుమతులు లేవని తెలిపారు.

# కోసు పటేల్ గూడలో రాత్రి భయం

## - వీధి లైట్ల లేమి ప్రజలకు కష్టం

**సిరికొండ, సెప్టెంబర్ 3 సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండల సుంకిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కోసు పటేల్ గూడ గ్రామం రాత్రిపూట మత్తుగుండా మారింది. గత 20 రోజులుగా వీధి లైట్లు వెలుగులు విరామం తీసుకోవడం, కొన్ని వీధులు పూర్తిగా మూగబోవడం వల్ల గ్రామస్తులు రాత్రి ఇంటి వెలుపల వెళ్ళడానికి భయపడుతున్నారు. వీధులు మూగబోవడం వల్ల వర్షాకాలంలో సర్పాలు, విషపురుగులు ఎక్కువగా రావచ్చని గ్రామస్తులు తెలిపారు. రాత్రి పూట బయటకు వెళ్ళడం భయంగా ఉందని, పిల్లలు కూడా భయంతో ఆరు బయటకు వెళ్లలేకపోతున్నారన్నారు. గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినప్పటికీని 15 నెలలుగా ఎటువంటి పరిష్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు పెద్దలతో, పిల్లలతో రాత్రి సురక్షితంగా తిరగడం కోసం తక్షణమే వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# డిగ్రీ కళాశాలలో జూనియర్లకు ఘన స్వాగతం

## - ప్రెషర్ పార్టీ సందడి

**వాంకిడి సెప్టెంబర్ 3,సూర్య మేజర్ న్యూస్:** వాంకిడి మండల కేంద్రంలోని అసిఫాబాద్ (బెండర)ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మంగళవారం ప్రెషర్ పార్టీని ఘనంగా నిర్వహించారు. కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ వేడుకలో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో మార్మోగిపోయింది.కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, స్కిట్స్‌తో వినోదాన్ని పంచుకున్నారు. రంగురంగుల దుస్తులు, సంగీతం, హాస్యనాటికలు విద్యార్థులను అలరించాయి. జూనియర్లు తమ ప్రతిభను చూపించుకోవడానికి ఈ వేదికను వినియోగించుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. కనకయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కష్టపడి చదవాలని, స్నేహభావం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అధ్యాపకులు కూడా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ప్రోత్సహిస్తూ వారికి విద్యతో పాటు సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులు పరస్పరం కలిసిమెలసి చదివితే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో వాంకిడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన డిపిఓ

**జన్నారం, సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలంలో ఈనెల 5న గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయు ప్రాంతాలను బుధవారం మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాలను పర్యటించి నిమజ్జనం సమయంలో ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాల కార్యదర్శులు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జన్నారం వాగు సమీపంలో జన్నారం వాగు సమీపంలో స్థానిక సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్న ప్రదేశాన్ని డిపిఓ వెంకటేశ్వరరావు సందర్శించారు. నిమజ్జనం రోజు గణేష్ విగ్రహాలు తీసుకెళుతున్న వాహనాలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదేవిధంగా విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఎంపీ ఓ జలంధర్, గ్రామ కార్యదర్శి రేగుంది రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ ఉన్నారు.




# ఆకాంక్షిత నుండి అభివృద్ధి వైపుగా జిల్లాను నడిపించాలి .. నీతి అయోగ్ సి.ఈ.ఓ.

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఆకాంక్షిత నుండి అభివృద్ధి వైపుగా నడిపించాలని నీతి అయోగ్ సి.ఈ.ఓ. అన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సి.ఈ.ఓ. మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాను అభివృద్ధి వైపుగా నడిపించి ముందు వరసలో ఉంచాలని తెలిపారు. జిల్లా, బ్లాక్ స్థాయిలో నీతి అయోగ్ ద్వారా చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ కార్యక్రమం ద్వారా చేపడుతున్న పనులను జిల్లాలో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలోని తిర్యాణి





బ్లాక్ లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అధికారుల సమన్వయంతో నీతి అయోగ్ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులోకి వరద ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
### ...జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో ఎడతెరిప లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం



లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి చేరుతున్న వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఎస్ ఆర్ ఎస్ పి, కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక పెరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కురిసిన వర్షాలతో వాగులు, చెరువుల నుండి సైతం వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఇన్ ఫ్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రాజెక్టు నుండి నీటి అవుట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆది కర్మయోగి అభియాన్‌ను విజయవంతం
# చేయండి..ఎంపీడీఓ రమేష్

**బోథ్, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్:**

ఐటిడిఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంను విజయవంతం చేయాలని బోథ్ ఎంపీడీఓ రమేష్ అన్నారు. బుధవారం బోథ్



రైతు వేదికలో విద్య, వైద్య ఆరోగ్యం ,అటవీ ,పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీరు, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.గ్రామస్థాయిలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, ప్రజల యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపర్చుటకు రాబోయే ఐదు సంవత్సరాల కాలానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్య, వైద్య ఆరోగ్యం,అటవీ, పంచాయరాజ్,గ్రామీణ త్రాగునిరు, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖధికారులు పాల్గొన్నారు.

### మహిళలను వేధిస్తున్న
# ముగ్గురుపై కేసులు
### - మహిళలను వేధిస్తుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్న
### పోలీసులు - షీ టీం ఇన్చార్జ్ ఏఎస్ఐ బి సుశీల

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

ఆదిలాబాద్ జిల్లాలో మహిళల రక్షణ భద్రత ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ షీ టీం బృందం అప్రమత్తతతో ఉంటూ విధులు నిర్వర్తిస్తుందని షీ టీం ఇన్చార్జ్ ఏఎస్ఐ బి సుశీల తెలియజేశారు. ముఖ్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో రాత్రి సమయాలలో మహిళల వేధింపులను నియంత్రించడానికి షీ టీం బృందాలు అందుబాటులో ఉంటూ ప్రజలలో మమేకమై తిరుగుతూ ఉంటారని ఈ సందర్భంలో గత రెండు రోజులలో ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను తిలకించడానికి వేలాదిమంది ప్రజలు రాగా అందులో ఆకతాయిలు మహిళలను వేధిస్తూ రెడ్ హ్యాండెడ్ గా సంఘటనా స్థలంలో పట్టుబడ్డారని తెలియజేశారు. నిందితులు వాహనాలపై తిరుగుతూ మరియు ఒక స్థలంలో ఉండి మహిళలపై వేధింపులు, వికృతి చేష్టలు చేస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబట్టడం జరిగిందని తెలిపారు. ఇలాంటి వాటిని అడ్డుకోవడం కోసమే ప్రత్యేకంగా షీ టీం బృందం అప్రమత్తతతో ఉంటుందని తెలిపారు. మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పట్టణంలో షీ టీం బృందం రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఉంటూ మహిళల భద్రతకై పాటుపడుతుందని తెలిపారు. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 లేదా ఆదిలాబాద్ షీ టీం నెంబర్ 8712659953 నెంబర్ కి సంప్రదించవచ్చని సూచించారు. ఆదిలాబాద్ షీ టీం అతివల రక్షణకై అహర్నిశలు పాటుపడుతుందని తెలిపారు. ఈ ఈ స్పెషల్ ఆపరేషన్ నందు షీ టీం బృంద సభ్యులు హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, సిబ్బంది మహేష్, రోహిణి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ
### - అడ్మిషన్ పోస్టర్లను విడుదల చేసిన పిఓ కుష్బూ గుప్తా

**ఉట్నూర్ సూర్య మేజర్ న్యూస్ :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆదివాసి గిరిజన విద్యార్థులకు పి వి టి జి ఉచిత విద్య అందిస్తుందని డి బి ఏ ఓ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు తెలిపారు. మారుమూల అటవీ




ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు అనేక ఆర్థిక సామాజిక కారణాల విద్యను అందించాయి ఓపెన్ వర్సిటీ 500 రూపాయలు మాత్రమే ఫీజుతో డిగ్రీ( యూజీ బిఏ బీకాం బీఎస్సీ ) విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామన్నారు, ఈ సందర్భంగా ఉట్నూర్ ఐటిడిఏ పిఓ కుష్బూ గుప్త అడ్మిషన్లు పోస్టర్ని విడుదల చేశారు,అడ్మిషన్ల చివరి తేదీ సెప్టెంబర్ 12 అని తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరమణ ఓపెన్ యూనివర్సిటీ గత 43 సంవత్సరాల నుంచి నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు ప్రొఫెసర్ గంటి రవీందర్ ఆదివాసులకు విద్యతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో దామోదర స్వామి, ఉట్నూరు డిగ్రీ కాలేజ్ సిబ్బంది ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు అవార్డులు దక్కేనా

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 3 సూర్య మేజర్ న్యూస్**

ఉపాధ్యాయ దినోత్సవం ను పురస్కరించుకుని ఉపాధ్యాయులకు ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అర్హులకు ఇస్తారో లేక ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి లకు తలొగ్గి వారు చెప్పిన వారికి ఇస్తారో వేచి చూడవలసిందే. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ ఎంపిక అస్తవ్యస్తంగా జరిగిన సంగతి అందరికీ తెలిసిందే. అప్పటి డీఈవో అర్హులను కాకుండా అనర్హులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశారనే అపవాదు మూట కట్టుకున్నారు. ఈ సంవత్సరము జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ్ను గా అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఉపాద్యాయ సంఘాల ఒత్తిడి కి లోను కాకుండా పారదర్శకంగా నిర్వహించాలని అంటున్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు వేటిని ప్రామాణికంగా తీసుకోవాలి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఉపాధ్యాయులను ఎంపిక చేసేటప్పుడు ఆ పాఠశాల విద్యార్థుల ఎన్రోల్మెంట్ ను,డ్రాప్ అవుట్లను బడిలో చేర్పించవలసిన బాధ్యతను పూర్తి చేయడం,పదవ తరగతి ఫలితాలు, పాఠ్యేతర కార్యక్రమాలు, వనమహోత్సవం, కిచెన్ గార్డెన్, ఉపాధ్యాయుడి బోధన విధానం, ఆశించిన అభ్యసన ఫలితాలు మొదలగు వాటిని పరిగణలోనికి తీసుకొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలి

### గతంలో ఏం జరిగింది

గతంలో రాజకీయ జోక్యము, ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి వలన అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చినారు. అప్పుడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం ఉత్తిత్తి ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంగా మారింది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. అర్హులకు మాత్రమే అవార్డులు ఇస్తాం. ఇందులో ఎటువంటి అనుమానాలకు తావు లేదని దర్శనం భోజన్న జిల్లా విద్యాధికారి తెలపారు.

## పాలగోరిలో 52 చెట్లను నరికిన ఆదివాసీలు

**జన్నారం, సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ లోని పాలగోరి ప్రాంతంలో అక్రమంగా గుడిసెలు వేసుకున్న ఆదిలాబాద్ జిల్లా నెట్నూర్, లింగాపూర్, జైనూర్ మండలాలకు చెందిన 60 మంది లోతుర్రే బీట్ లో మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా టేకు అలాగే గైరి జాతికి చెందిన 52 చెట్లను నరికి వేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న 14 మంది అటవీ సిబ్బంది నరికివేతను అడ్డుకున్న




పట్టించుకోకుండా వారిని నెట్టేసి చెట్లను ధ్వంసం చేశారని ఇంధన్ పల్లి రేంజ్ ఆఫీసర్ శ్రీధరాచారి తెలిపారు. సమాచారం అందుకున్న లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎఫ్ఆర్ఓ శ్రీధర చారి, జన్నారం దండేపల్లి ఎస్సైలు గొల్లపల్లి అనూష, తహిసోద్దీన్, అలాగే అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆదివాసీలతో లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి మాట్లాడుతూ అక్రమంగా అడవులను నరకడం చట్టరీత్యా నేరమని, భూమి కావాలనుకుంటే కలెక్టర్ను సంప్రదిస్తే మంచిదని, అలా కాకుండా చట్టాన్ని చేతిలోకి తీసుకొని చెట్లను నరికితే కేసులు పెట్టవలసి వస్తుందని, దీంతో కటకటాలు అనుభవించాల్సి వస్తుందని అన్నారు.

### చంద్రవెల్లిలో సోమేశ్వరాలయంలో
# 108 నైవేద్యాల నివేదన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి శ్రీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఎనిమిదవ రోజు బుధవారం విఘ్నేశ్వరునికి శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర దేవాలయ కమిటీ, సేవకుల ఆధ్వర్యంలో స్వామివారికి 108 నైవేద్యాల నివేదన చేయడం జరిగింది. దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రుల ఉత్సవాలలో సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈరోజు అన్నదాత రామగోని గంగాధర్ గౌడ్ వారి కుమారుడు శైలజ అనిల్ గౌడ్ దంపతులచే అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు

## డిగ్రీ విద్యార్హత - గ్రేడ్-3 క్లర్క్ పోస్టులకు అర్హత

### -గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశం మేరకు నిర్ణయం - సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ త్వరలోనే ద్వైపాక్షిక, త్రైపాక్షిక ఒప్పందాల అనంతరం ఉత్తర్వుల విడుదల

**శ్రీరాంపూర్ సెప్టెంబర్ 03, సూర్య న్యూస్:**

గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల్లో పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులను ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన 51 వ నిర్మాణాత్మక సమావేశంలో జరిగిన చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంస్థ సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలోనే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తో యాజమాన్యం ద్వైపాక్షిక ఒప్పందం, అనంతరం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం చేసుకోనుంది. అనంతరం దీనికి సంబంధించిన



ఉత్తర్వులు వెలువడనున్నాయి. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్గా మాత్రమే పనిచేసే అవకాశం దక్కేది. అయితే 2009 లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా(మైనింగ్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఐటీఐ(ఎలక్ట్రికల్/ ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతల కు తగిన ఉద్యోగాలు కల్పించడానికి అంగీకరించారు. తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చి గ్రేడ్ -3 క్లర్కు ఉద్యోగాలను కల్పించడానికి నిర్ణయించడం జరిగింది. అయితే ఒకవేళ మరణించిన ఉద్యోగి కుటుంబంలో అర్హులైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేనిపక్షంలోనే డిగ్రీ అర్హత ఉన్న వారిని గ్రేడ్ 3 క్లర్కు పోస్టు అభ్యర్థిత్వానికి పరిశీలించడం జరుగుతుంది. ఇదీ నేపథ్యం...ఈ ఏడాది జూన్ 27వ తేదీన జరిగిన డైరెక్టర్ (పర్సనల్) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన ప్రతిపాదనపై యాజమాన్యం స్పందించి ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారు ఈ అంశంపై లోతుగా చర్చించి నివేదికను సమర్పించారు. దీనిపై సంస్థ సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందిస్తూ ఇకపై గని ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల పట్ల సానుభూతితో స్పందించి వారి కుటుంబంలో డిగ్రీ విద్యార్హతలు గల వారసులకు గ్రేడ్ 3 క్లర్కు పోస్టు కు అర్హత కలిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే జరగబోయే ద్వైపాక్షిక, త్రైపాక్షిక ఒప్పందాల అనంతరం ఉత్తర్వులు వెలువడనున్నాయి. సంస్థలో గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల లభ్యతను బట్టి కంపెనీ వీరికోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలో డిగ్రీ అర్హత గల వారసులు పాల్గొనాల్సి ఉంటుందని పరీక్షలో పాసైన వారు మాత్రమే గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల నియామకానికి అర్హత సాధిస్తారు. గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారసులను క్యాటగిరి ఒకటి జనరల్ అసిస్టెంట్ గా గుర్తిస్తూ ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుంది.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**సారంగాపూర్,సెప్టెంబర్ 4,సూర్య మేజర్ న్యూస్**

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు.మండలంలోని స్వర్ణ గ్రామంలో బుధవారం రోజు ఆయన పర్యటించారు.గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను, పరిశీలించిన అనంతరం ఆశ్రమ పాఠశాలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అయన వెంట మండల పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమలత ఉన్నారు.



## నూతన విద్యా విధానంపై దృష్టిసారించాలి

### -ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి
### -నస్పూర్లో ఉత్తమ ఉపాధ్యాయులకు ట్రస్మా ఘన సన్మానం
### -పాల్గొన్న జిల్లాలోని పాఠశాలల ఉపాధ్యాయులు

**నస్పూర్, సెప్టెంబర్ 3 సూర్య మేజర్ న్యూస్:**

రోజు రోజుకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంపై దృష్టిసారించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్రెడ్డి సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్మా ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్లో మంచిర్యాల జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ అధినేత నరేందర్రెడ్డి, ఎంఈవో పద్మజ, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టిఫిషిల్ ఇంటిలిజెన్స్ కాలంలో సెలబస్ మొత్తం కొత్త పుంతలు తొక్కుతుందని, దీనికి అనుగుణంగా విద్యా బోధనలో మార్పులు తీసుకురావాల్సి అవశ్యకత ఎంతో ఉందన్నారు. 2028-27లో రాష్ట్రంలో కొత్త విద్యా పాలసీ రాబోతుందని, దీంతో విద్యా విధానంలో అనేక మార్పులు చోటుచేసుకోబోతున్నట్లు చెప్పారు. వెనుగబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పిల్లలకు అర్థమైయ్యే విధంగా పాఠాలు బోధించాలని, ముఖ్యంగా పిల్లలతో ఎక్కువగా ప్రాక్టీస్ చేపిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ సబ్జెక్టులపై పట్టుసాధిస్తే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారిగా మోటివేషన్, ఓరియంటేషన్ క్లాసులను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ట్రస్మా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు త్వరలోనే హెల్త్ స్కీంను ప్రారంభించడం జరుగుతుందన్నారు. తాము ఇతర సంఘాల్లా కాకుండా ఒక క్రమశిక్షణతో విద్యా సంస్థలను నడిపిస్తూ విద్యాబోధన, ఉపాధ్యాయుల సంక్షేమం, పలు సేవా కార్యక్రమాలను స్వంత ఖర్చులతో చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 78మంది ఉత్తమ ఉపాధ్యాయులను, అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా బోధన చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న పలువురిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు శ్యాంసుందర్రెడ్డి, రజనీ, రేగళ్ల ఉపేందర్, మైదం రామకృష్ణ, ఊట్ల సత్యనారాయణ, అంబాల రాజ్కుమార్, పెట్టం మల్లయ్య, బత్తిని దేవన్న, కృష్ణారెడ్డి, అంబాల రాజ్కుమార్, అమన్ ప్రసాద్, సమ్మిరెడ్డి, మమత, జూల్పెకర్, సత్యనారాయణరెడ్డి, జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ట్రస్మా ప్రతినిధులు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల బరిలో బీసీ పార్టీ యువత రాజకీయాల్లోకి రావాలి

### - తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ మహేష్ వర్మ

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ జేఏసీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంపై కీలక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇంచార్జి మహేష్ వర్మ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ పోటీ చేస్తుందని తెలిపారు.తీన్మార్ మల్లన్న సారధ్యంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఎంపిటిసి, జెడ్పిటిసి,సర్పంచ్ లుగా పోటీ చేయాలని అనుకుంటున్న బీసీ, బహుజనుల అభ్యర్థులకు తీన్మార్ మల్లన్న తోడుగా ఉన్నారని, తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ అండగా ఉంటుందని స్పష్టం చేసారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బీసీలను, బహుజనులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. గత కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా బీసీలకు 42శాతం అన్నిరంగాల్లో అమలుచేస్తామని,9వ షెడ్యూల్ లో పొందు పరుస్తామని హామీ ఇచ్చి కేవలం రాజకీయ లబ్ది కొరకే ఎన్నికల్లో వాటా ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్, బిఆర్ఎస్,బిజెపి పార్టీలు కేవలం రాజకీయ లబ్ది పొందేందుకు మాత్రమే బీసీ వాదాన్ని వినిపిస్తున్నాయి తప్ప,బీసీల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదనే విషయాన్ని ఈ బీసీ సమాజం గమనిస్తుందని అన్నారు.ప్రజా క్షేత్రంలోనే ప్రజలు ఓటుతో మీకు బుద్ధి చెబుతారని అన్నారు.



మంచిర్యాల జిల్లా ప్రజలు చైతన్యం అయ్యారని మీ కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.తీన్మార్ మల్లన్న సారధ్యంలో మంచిర్యాల జిల్లాలో నూతన రాజకీయాలకు జీవం పోస్తామని స్పష్టం చేశారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కిరాయి పార్టీల జెండాలు మోసింది చాలని, మన జెండాను మాత్రమే మనం మోసుకొని, మన ఓట్లతోనే మన రాజ్యాధికారాన్ని మనం సాధించుకుందామని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని, ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన ఉన్న అభ్యర్థులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ కార్యాలయంలో మీ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా నాయకులు పాకాల దినకర్, దాస్యపు దీపక్, ఎల్తపు రాజశేఖర్, పడాల శివతేజ, సీపతి సాయికిరణ్, మహమ్మద్ లతీఫ్, కొత్తూరి సంతోష్, కుంట రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధం

### ..జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**కాగజ్ నగర్ టౌన్ సూర్య మెజర్ న్యూస్**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలను శాంతి భద్రతల మధ్య సాఫీగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. బుధవారం ఎస్పీ కాగజ్నగర్ లోని నిమజ్జన ప్రదేశమైన పెద్దవాగు ను కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల,ఆసిఫాబాద్ ఏఎస్పి చిత్తరంజన్ లతో కలిసి పరిశీలించారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ శోభాయాత్ర జరిగే మార్గాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, నిమర్జన ప్రాంతం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమర్జన ప్రాంతం వద్ద వినాయక ప్రతిమల నిమర్జనాల కోసం క్రేన్లు, లైట్ల ఏర్పాటు, నిమజ్జన ఘాట్ల వద్ద ఈతగాళ్లతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్, కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, కాగజ్ నగర్ టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, డి.ఈ.ఈ రమాదేవి, కాగజ్ నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు కాగజ్ నగర్ మండలం ఇస్గాం నజురుల్ నగర్ కి చెందిన ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ఏ.ఆర్.ఎస్.ఐ గా పనిచేస్తున్న జగదీష్ చంద్రమండల్ (55) నిన్న రాత్రి తన స్వగ్రామంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈరోజు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గారు, జగదీష్ చంద్రమండల్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

## ఖానాపూర్ లో తత్కాలిక ఆధార్ కేంద్రం ఏర్పాటు

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 3 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు కొత్తగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో రత్నాకర్ రావు తెలిపారు. ప్రస్తుతం కడెంలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని ఖానాపూర్ కు తీసుకు వస్తున్నాం అన్నారు. ఖానాపూర్ కు నూతన ఆధార్ కేంద్రం మంజూరయ్యే వరకు, కడెం ఆధార్ కేంద్రమును ఖానాపూర్ లో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపినారు. ఎంపీడీవో కార్యాలయం ప్రక్కనే గల ఇందిరమ్మ మోడల్ హౌస్ లో దీనిని గురువారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# పోలీసుల భరోసా, కవాతు ర్యాలీ

**కాగజ్నగర్ ,సెప్టెంబర్ 3 , సూర్య మేజర్ న్యూస్:**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో 6 సెప్టెంబర్ 2025, శనివారం రోజున గణేష్ నిమజ్జనం కొరకు గణేశులను శోభయాత్రగా తీసుకువెళ్లే వేడుకల నేపథ్యంలో పోలీసులు ఈరోజు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ కవాతు కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చిత్తరంజన్



ఆధ్వర్యంలో 100 మంది పోలీసులు కాగజ్ నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపుఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ గణేశుల నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత కల్పిస్తారని ప్రజలకు భరోసా కల్పించడానికి కవాతు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిఐలు, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదానం-మహాధానం-గర్మిల్లా గణేష్ మండలి సభ్యులు

**మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్:**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంచిర్యాల గర్మిల్లా హనుమాన్ దేవాలయం సమీపంలో శ్రీ హనుమాన్ గర్మిల్లా గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టాపించిన వినాయక మండపం వద్ద బుధవారం మహా



అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు,భజనలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.పట్టణం కు చెందిన వివిధ వార్డులకు చెందిన ప్రజలు,భక్తులు అధిక సంఖ్య లో పాలుగొని అన్నదాన కార్యక్రమంని విజయవంతం చేశారు.అన్ని ధానాలలో అన్నదానం గొప్ప దానం అని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమం లో శ్రీ హనుమాన్ గర్మిల్లా గణేష్ మండలి కమిటీ సభ్యులు రాయిల్లా వెంకట్ రెడ్డి,అకేనాపెల్లి మధు,కళ్యాడపు నారాయన,పుప్పాల హరీష్,ఆంజన రావు,కుమార్ యాదవ్,తదితరులు పాలుగోన్నారు.

## ధూమ్ ధామ్ కళాకారుడు దరువు భోజన్న ను పరామర్శించిన డిసీసీ అధ్యక్షులు

**సారంగాపూర్,సెప్టెంబర్ 4,సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రానికి చెందిన ధూమ్ ధామ్ కళాకారుడు దరువు భోజన్న తండ్రి టేకులపల్లి పెద్దన్న, ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు



బుధవారం రోజు పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు,వారి కుటుంబానికి అండగా ఉంటానాని మనో ధైర్యాన్ని అందించారు.అయన వెంట వ్యక్తిగత సహాయకులు గాజుల రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజీ నర్సయ్య,మాజీ సర్పంచ్ నర్సరెడ్డి, రేషన్ డీలర్ సంఘం అధ్యక్షులు నారాయణ రెడ్డి,స్వర్ణ ప్రాజెక్టు చైర్మన్ ఓలత్రి నారాయణరెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు బజార్ నర్సయ్య,జెండా గల్లీ కాలనీ సభ్యులు సామల భూమేష్, కూనపులి నరేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

**సిరి కొండ సూర్య మేజర్ న్యూస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, రైతు బంధు, ప్రజా నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మంగళవారం సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని, ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని గుర్తుచేశారు. వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుని పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ చైర్మన్ ఎం.డి. రంజాన్, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు కరుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, ఆత్మ డైరెక్టర్ జింక మల్లేష్, సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, కంచం లక్ష్మణ్, ఎం.డి. రసిద్, జెల్ల సతీష్, ప్రవీణ్, పరమేశ్వర్, లక్ష్మన్న, హైదర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్లో ఘనంగా గణపతి హెూమం

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల పట్టణం లోని కాలేజీ రోడ్ లో గల అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్లో బుధవారం ఘనంగా గణపతి హెూమం నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి శ్రీ



విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించినటువంటి గణపతి హెూమం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైరారు. ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి జ్యోతిని నరేందర్ రెడ్డి వెలిగించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గణపతి హెూమం చాలా విశిష్టమైన కార్యక్రమని, శుభఫలాలు అందించేటువంటి ఒక గొప్ప ప్రక్రియ అన్నారు. గణపతి హెూమం చాలా శుభఫలాలు ఇచ్చేటువంటి ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత ఉన్నదని, ముఖ్యంగా అందరికి సుఖ సంతోషాలు కల్పిస్తాయని తెలిపారు. గణపతి హెూమం చాలా గొప్ప యజ్ఞమని, విజయానికి కావలసినటు వంటి మార్గాలను సుగమం చేస్తుందని అన్నారు. ముఖ్యంగా పలు కార్యకలాపాలలో ఎదురవుతున్నటు వంటి అడ్డంకులను తొలగించినటు వంటి ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరు చేపట్టాలని కోరారు. వృత్తిపరంగా, వ్యక్తిగత అభివృద్ధికి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండడానికి ఈ హెూమం ద్వారా భగవంతుని ఆశీస్సులు పుష్కలంగా పొందవచ్చును అన్నారు. హెూమంలో భాగంగా వివిధ రకాల ద్రవ్యాలతో స్వామి వారికి హెూమం నిర్వహించిన అనంతరం ప్రధాన ఘట్టమైనటువంటి పూర్ణాహుతి కార్యక్రమాన్ని చాలా శోభాయమానంగా వేదమంత్రాలు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేష అలంకరణ చేసి స్వామి వారి యొక్క ఆశీస్సులు లోకాభివృద్ధికి ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. గణపతి హెూమం నిర్వహణ పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ చక్కని కార్యక్రమాన్ని చేపట్టినటువంటి యజమానియానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫాం, బూట్లు ఇవ్వాలి

**- సిఐటియు బ్రాంచ్ సెక్రటరీ అల్లి రాజేందర్**

**మందమర్రి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్:**

ప్రతి సంస్థకు భద్రత విభాగం కీలకమని అలాంటి సెక్యూరిటీ సిబ్బందికి వృత్తిపరమైన రూపాన్ని అందించే యూనిఫాం, బూట్లు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు బ్రాంచ్ సెక్రటరీ అల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పరేడ్ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బందిని సిఐటియు బ్రాంచ్ సెక్రటరీ అల్లి రాజేందర్ కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాడర్ స్కీం ప్రమోషన్లు ఇప్పిచ్చామని గొప్పలు చెప్తున్నా ఏఐటియుసి నాయకులు భద్రత సిబ్బందికి బూట్లు, యూనిఫామ్ క్లాత్ ఇప్పటివరకు ఇవ్వకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఒకవైపు సంస్థలో తగ్గిపోతున్న సెక్యూరిటీ సిబ్బందిని పెంచుకోవడంపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని గత పది సంవత్సరాలకు పైగా నూతన సిబ్బంది నియామకం చేయలేదని, ఉన్నవారితోనే కాలం గడుపుతున్నారని పైగా ప్రైవేటు సెక్యూరిటీని పెంచుకోవడంలో ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ప్రతి సంస్థకు భద్రత విభాగం చాలా కీలకమని ఇప్పటికైనా యాజమాన్యం సెక్యూరిటీ విభాగాన్ని పటిష్టం చేసేలా కొత్తగా వస్తున్న యువతతో భర్తీ చేయాలని,



వారు విధులు నిర్వహిస్తున్న చెక్ పోస్టులలో కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని అన్నారు. మరోవైపు ఏఐటీయూసీ నాయకులకు గుర్తింపు సంఘంగా వారి బాధ్యతను గుర్తు చేస్తే వారు విమర్శలు అనుకుంటున్న తీరు సరైనది కాదని, లాభాలను ఇప్పటికి చెప్పకుండా ఆలస్యం చేస్తున్న యాజమాన్య తీరును వ్యతిరేకిస్తూ గుర్తింపు సంఘం అన్ని కార్మిక సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి పోరాటానికి పిలుపులు ఇవ్వాలని అల్లి రాజేందర్ సూచించారు.

# సిద్ధి వినాయక మండపములో ఘనంగా లక్ష్మి గణపతి హెూమం

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ శ్రీ సిద్ధి వినాయక పర్యావరణ హిత మండపంలో బుధవారం జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, ఉత్సవ కమిటీ నిర్వాహక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి హెూమం ఘనంగా కనుల పండుగలా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల, పెన్షనర్స్ సమస్యలు అన్ని అతి తొందరలోనే నెరవేరాలని కోరారు.టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ



సమస్యలు కోర్టు కేసులు అన్ని పరిష్కారం తొందరలో కావాలని గణపతి ని కోరారు.ప్రతి ఒక్క హౌసింగ్ సొసైటీ సభ్యులు అతి త్వరలో ఇల్లు కట్టుకొని నివాసం ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అన్ని రంగాలలో భారత దేశం లోనే మొదటి స్థానంలో ఉండాలని కోరారు. ఈ హెూమంలో కమిటీ నాయకులు పొన్న మల్లయ్య, వెన్నం లక్ష్మీ నారాయణ, పొలంపల్లి వెంకటేశ్వర్, కొంద్ర బాలయ్య, సత్యనారాయణ, బెక్కం ఊషన్న, నక్క రాజన్న, సకుటుంబ సమేతముగా భక్తి శ్రద్ధల తో గణపతి హెూమం సాయి మృదుల్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్ దంపతులచే అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు భూముల రామ్మోహన్, సైండ్ల మొండయ్య, శ్రీపతి బాబురావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మందమర్రి జిఎం గా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణా

**మందమర్రి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి కాలరీస్ కంపనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గా ఎన్ రాధాకృష్ణా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం కార్పొరేట్ లో ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహించిన రాధాకృష్ణా బదిలీపై



మందమర్రి ఏరియాకు రావడంతో ఆయనకు ఏరియా జిఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా రక్షణ అధికారి భూ శంకరయ్య, ఐఈడి ఎస్ ఈ కిరణ్ కుమార్ మందమర్రి ఏరియా అన్ని డిపార్టుమెంట్ల హెచ్ఓడీ లు నూతన జిఎం కు పుష్పగుచ్చం అందజేసి వేద పండితులచే వేద మంత్రాలతో ఘనంగా స్వాగతం



పలికారు. ఈ సందర్భంగా ఏరియాలోని అన్ని గనుల డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులతో గనుల డిపార్ట్మెంట్ల స్థితిగతులను జిఎం సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, సోలార్ విద్యుత్ ప్లాంట్ వివరాలు, ఏరియా స్థితిగతులను అన్ని డిపార్ట్మెంట్ల



హెచ్.ఓ.డి లు ఏరియా జనరల్ మేనేజర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి సంస్థ నిర్దేశిత లక్ష్యాలు సాధిద్దామని అన్నారు.

## పత్తిపై తగ్గించిన దిగుమతి సుంకాలను ఉపసంహరించుకోవాలి

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 3 సూర్య మేజర్ న్యూస్**

కేంద్ర ప్రభుత్వం పత్తిపై తగ్గించిన దిగుమతి సుంకాలను ఉపసంహరించు కోవాలని ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిరామయ్య డిమాండ్ చేసినారు. సంయుక్త కిషన్ మోర్చే జాతీయ కమిటీ పిలుపుమేరకు కేంద్ర



ప్రభుత్వం పత్తి దిగుమతుల పైన 11% సుంకాన్ని తగ్గించడాన్ని నిరసిస్తూ తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి, తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. వివిధ దేశాల నుండి వచ్చే పత్తికి దిగుమతి సుంకాలు తగ్గిస్తే మన దేశ రైతులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు.ఈ కార్యక్రమంలో నూతన్ కుమార్, తిరుపతి, రమేష్, నర్సయ్య,గోరెబాయ్, నారాయణ,బీమేష్, రాజేష్,భూమన్న తదితరులు ఉన్నారు.

## బ్రిడ్జి పై నుండి ప్రవహిస్తున్న పెన్ గంగ రాకపోకలు నిలిపివేత

**సిర్పూర్ , సెప్టెంబర్ 3 , సూర్య మేజర్ న్యూస్:**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలంలోని వెంకట్రావుపేట



మరియు పోడస్సా బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరుగడం తో బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న పెనుగంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా రాకపోకలు నిలిపి వేసిన అధికారులు.

## కేకే ఓసిని సందర్శించిన ఏరియా జిఎం రాధాకృష్ణ

**మందమర్రి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఉపరితల గనిని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను, భద్రతకు సంబంధించి చేపట్టిన రక్షణ చర్యలను పరిశీలించారు. జిఎం గా బాధ్యతలు



చేపట్టి మొట్ట మొదటి సారిగా కేకే ఓసీ కి విచ్చేసిన ఏరియా జిఎం రాధాకృష్ణకు కేకే ఓసి ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్ వెంకట వంశీధర్ లు శాలువా కప్పి, పూల మొక్క అందించి జిఎం రాధాకృష్ణకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గని ఆవరణలో ప్రతిష్టించిన వినాయకుని మండపంలో జీఎం ఎన్ రాధాకృష్ణ గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డంపర్స్ విభాగాన్ని పరిశీలించి, యంత్రాలకు అవసరమైన విడిభాగాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని, బ్రేక్‌డౌన్లను తగ్గించి పరికరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేసి, ప్రమాదాలు లేకుండా బొగ్గు ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాలని, తద్వారా సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు. ఈ సందర్శనలో జిఎం తో పాటు ఎస్ఓ టు జిఎం ఆర్ విజయ ప్రసాద్, ఎస్ఈ(ఐఈ) కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ద్వారా గర్భిణీ మహిళల తరలింపు

**సిర్పూర్ టి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్:**

సిర్పూర్ టీ మండలం హుడికిలి గ్రామం లో ఉన్న ముగ్గురు గర్భవతి మహిళలను ట్రాక్టర్ ద్వారా సిర్పూర్ టీ వైపు తరలించిన సిర్పూర్ టీ తహసీల్దార్ రహీముద్దీన్, వైద్య సిబ్బంది, పోలీస్, రెవెన్యూ సిబ్బంది.



## వరదల వల్ల నష్ట పోయిన రైతును ఆదుకుంటాం - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**పెంబి,సెప్టెంబర్ 3,సూర్య మేజర్ న్యూస్:**

ఇటీవల భారీ వర్షాల వల్ల పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.బుధవారం పెంబి మండలంలోని తాటిగూడ, పుల్గంపాండ్రి గ్రామాలలో వరద ప్రభావిత



ప్రాంతాలలో పర్యటించి ముంపు కు గురైన పంటలను, కోతకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు.పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### బాధితుల పరామర్శ

ఇటీవల మండల కేంద్రంలో గుండె పోటుతో మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దార్గుల చిన్నయ్య కుటుంబాన్ని, ఆత్మహత్య చేసుకొని మరణించిన అందె రమేష్ కుటుంబను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాధితుల ఇళ్లకు వెళ్లి



పరామర్శించారు.అండగా ఉంటామని,అందె రమేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు తులాల శంకర్, గుగ్గిళ్ల భూమేష్, మల్లేపల్లి స్వామి, కృష్ణమాచారి, సాయి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం

**పెంబి, సెప్టెంబర్ 3,సూర్య మేజర్ న్యూస్:**

పెంబి మండల కేంద్రంలోని గంగపుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భక్తులు



అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఇందులో కొండ్ర శ్రీకాంత్, బొక్కల రాజు, హరిష్, యోగి, గంగపుత్ర యూత్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నూతన జిఎం కు గుర్తింపు సంఘం నాయకులు ఘన స్వాగతం

**మందమర్రి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ కు గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏరియాలోని జిఎం కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించిన జిఎం ను ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సంస్థ



అభివృద్ధిలో, ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని అన్నారు. కార్మిక సంఘం నాయకులు కార్మిక సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఏరియాలో రక్షణతో కూడుకున్న ఉత్పత్తికి సహకరించాలని యూనియన్ ప్రతినిధులను కోరారు. మందమర్రి ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని, అందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ ఎండి అక్బర్ అలీ, బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, ఆర్కెపి వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు పెద్దపెల్లి బానయ్య, సివి రమణ, ఎగ్గేటి రాజేశ్వరరావు, పిట్ కార్యదర్శులు మర్రి కుమారస్వామి, హరి రామకృష్ణ, కే ఓదెలు, జిఎం కార్యాలయ పిట్ కార్యదర్శి సృజన గీతిక, జ్యోతి, శాఖ శ్రీనివాస్, ఎండి సిరాజ్, రాజేష్ కుమార్ యాదవ్, నాగేంద్ర బట్టు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

**బోథ్, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్:**

భారీ వర్షాల కారణంగా సోనాల మండల కేంద్రంకు చెందిన రామగిరి శ్రీనివాస్ కు చెందిన ఇల్లు పైకప్పు కూలింది. ఈ విషయం తెలుసుకున్న బోథ్



మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం బాధిత కుటుంబాన్ని సందర్శించి తక్షణ ఆర్థిక సహాయంను బాధితుడు రామగిరి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయం వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు సుధీర్ రెడ్డి, భీంరావు పాటిల్, తుల హరీష్, ఉప్పు విట్టల్, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

## రాంనగర్లో కొలువుదీరిన గణేశుని దర్శించుకుంటున్న ఎస్సై అనూష

**జన్నారం, సెప్టెంబర్ 03, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండలంలోని పలు గ్రామాలలో గణేష్ మండలిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలను ఎస్ఐ గొల్లపల్లి అనూష సందర్శించారు. బుధవారం ఎస్సై గొల్లపల్లి అనూష మండల కేంద్రంలో గల శ్రీ రామాలయం సమీపంలో రాంనగర్ కాలనీలో కొలువుదీరిన గణేశుని ఆమె దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అదేవిధంగా మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ని దర్శించుకుని గణేష్ కమిటీ సభ్యులతో మాట్లాడారు.



అదేవిధంగా మండల కేంద్రంలోని పలు గణేష్ మండపాలతో పాటు కవ్వాల్ తదితర గ్రామాలలో పర్యటించి గణేష్ మండల్ల సభ్యులతో మాట్లాడారు. గణేష్ నిమజ్జనం రోజు ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఏ సమస్య ఉన్న ఫోన్లో గాని నేరుగా గాని తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.

## సైబర్ జాగృతి దివాస్ - సైబర్ డి.ఎస్.పి హసీబుల్లా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైబర్ జాగృతి దివస్ ను నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మరియు లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ నందు డిజిటల్ అరెస్ట్ ల పేరుతో ప్రస్తుత సమాజంలో జరుగు నేరాలపై పూర్తి అవగాహనను విద్యార్థులకు మరియు లారీ ఓనర్స్, డ్రైవర్ లకు కల్పించి చైతన్య పరచడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నేరాలు జరుగు పద్ధతిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. జే.సంగీత, లారీ ఓనర్స్ ప్రెసిడెంట్ జైసింగ్ సైబర్ క్రైమ్ సిబ్బంది బి. సురేందర్, సంతోష్, అహద్, తదితరులు పాల్గొన్నారు.

## విభాగ్ సైన్స్ ఫెయిర్ పోటీలలో సత్తాచాటిన శిశుమందిర్ విద్యార్థులు

**భైంసా టౌన్,సెప్టెంబర్ 03,సూర్య మేజర్ న్యూస్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా ఇటీవల నిర్వహించిన ఆదిలాబాద్ విభాగ్ సైన్స్ ఫెయిర్ పోటీలలో గెలుపొంది ఈ నెల 12,1314 తేదీలలో కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ రకాలైన సైన్స్,మ్యాథ్స్ మోడల్స్,నూతన ఆవిష్కరణ,సైన్స్ ,వేద



గణితం క్విజ్,10 ప్రయోగాలు మరియు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అంశాలలో ఎంపికైన శ్రీ సరస్వతీ శిశు మందిర్ హై స్కూల్ సుభద్ర నిలయం పులేనగర్ భైంసా విద్యార్థులను అభినందించిన పాఠశాల ప్రబంధకారిణి,సమితి మరియు ఆచార్యుల బృందం.

## పాఠశాల విద్యార్థులకు టై బెల్ట్ పంపిణీ

**కుబీర్,సెప్టెంబర్ 03,సూర్య మేజర్ న్యూస్**

కుబీర్ మండలం నిగ్వ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రమాకాంత్ వినయ్ ట్రేడర్స్ ఏషియన్ పెయింట్ డీలర్ తన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల విద్యార్థులకు టై,ఐడెంటి కార్డు,బెల్ట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించడం జరిగినది.ఇదే కాకుండా నిగ్వ గ్రామానికి చెందిన శ్రీ బాలాజీ సేటు గారు (కొబ్బరికాయ ఏజెన్సీ) వారు 10000(పదివేయిల)విలువ గల పాఠశాలకు సంబంధించిన విద్యుత్ ఫిట్టింగ్ చేయించడం జరిగినది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాంపల్లి నాగభూషణ్ మరియు ఉపాధ్యాయులు నరసింహాచారి , రాథోడ్ సురేష్ కుమార్ , తుల శ్రీనివాస్ ,చెరుకు పోశెట్టి రాధ మరియు ముత్తవ్వ రామలింగం వసంత్ కుమార్‌ను పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు

# వెంటనే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ప్రతినిధి,సెప్టెంబర్03,సూర్య మేజర్ న్యూస్ :**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెంట వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్




లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వన మహోత్సవం, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల కు సంబంధించిన వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన వెంట వెంటనే పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై నిరంతరం పర్యవేక్షించి, ఇండ్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడ కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. నిర్మాణానికి డబ్బులు లేని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మహిళా స్వయం సంఘాల ద్వారా రుణాలు అందించాలని తెలిపారు.జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని వెంటనే



పూర్తిచేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యం, నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటిన వెంటనే సంబంధిత సైట్ లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో మొక్కలు నాటే ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యిందని, మిగిలిపోయిన లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని అన్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడ కూడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. నీరు అధికంగా నిల్వ ఉండే చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. ఇటీవలి జిల్లాలో భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించినప్పుడు అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నందుకు అధికారులందరిని కలెక్టర్ అభినందించారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, పిడి హౌసింగ్ రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా, ఎరువులు పంట సాగుకు అనుగుణంగా పంపిణీ చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యచరణ ప్రకారం పంపిణీ చేయాలని జిల్లా





కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భుక్యా ఛాత్రు తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో కార్యచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని,ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ - పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు, సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలలో ఎలాంటి విభేదాలు ఉండకూడదని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుండి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేసి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటల వివరాలు, సాగు మెలకువలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ, పంట సాగు చేసే రైతుల వివరాలు తదితర అన్ని అంశాలు అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి,కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో

# జరుపుకోవాలి

**- హిందూ ఉత్సవ కమిటీ సమావేశంలో వక్తలు**

**మందమర్రి, సెప్టెంబర్ 3, సూర్య మేజర్ న్యూస్.**

గణనాధుని నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హిందూ ఉత్సవ కమిటీ సమావేశంలో వక్తలు, అధికారులు సూచించారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో పట్టణ హిందూ ఉత్సవ కమిటీ ఆద్వర్యంలో పట్టణంలోని గణేష్ మండపాల, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ, సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్ రాయలింగు, ఎలక్ట్రికల్ శాఖ ఏఈ, సిఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, వేద పండితులు గోవర్ధనగిరి అనంత ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని గణేష్ మండలి వారికి ఉన్న సమస్యలను, ఇబ్బందులను ఉత్సవ



కమిటీ దృష్టికి తీసుకురాగా దానిపై చర్చించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు సొతుకు సుదర్శన్, బండారి సూరిబాబు, తిరుపతి రెడ్డి, మంద తిరుమల్ రెడ్డి, పట్టణంలోని అన్ని గణేష్ మండలి సభ్యులు పాల్గొన్నారు.

## మారుమూల గిరిజన ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటు చేయాలి .. ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, సెప్టెంబర్03,సూర్య మేజర్ న్యూస్:** బోథ్ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో నెట్వర్క్ సౌకర్యంను కల్పించాలని ఎమ్మెల్యే అనిల్



జాదవ్ అధికారులను కోరారు. నెట్ వర్క్ సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ సీజీఎంను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గల మారుమూల గిరిజన ప్రాంతాల్లో నెట్వర్క్ లేక అవస్థలు పడుతున్నారని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెట్వర్కులు లేని ప్రాంతాల్లో నూతన టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. నెట్వర్కులు ఉన్న గిరిజన ప్రాంతాల్లో టవర్లు సాంకేతిక లోపాల వల్ల నెట్వర్క్ సమస్యలు ఏర్పడుతున్నాయని, కొన్ని టవర్లకు విద్యుత్తు సౌకర్యం లేకపోవడంపై వినతిపత్రం అందజేశారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి కచ్చితంగా నెట్వర్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

**సిరి కొండ సెప్టెంబర్ 2 సూర్య మేజర్ న్యూస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, రైతు బంధు, ప్రజా నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మంగళవారం సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని, ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని గుర్తుచేశారు. వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుని పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ చైర్మన్ ఎం.డి. రంజాన్, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు కరుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, ఆత్మ డైరెక్టర్ జింక మల్లేష్, సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, కంచం లక్ష్మణ్, ఎం.డి. రసిద్, జెల్ల సతీష్, ప్రవీణ్, పరమేశ్వర్, లక్ష్మన్న, హైదర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# డిగ్రీ కళాశాలలో

**జూనియర్లకు ఘన స్వాగతం**

**- ఫ్రెషర్స్ పార్టీ సందడి**

**వాంకిడి సెప్టెంబర్ 3,సూర్య మేజర్ న్యూస్**

వాంకిడి మండల కేంద్రంలోని అసిఫాబాద్ (బెండర)ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మంగళవారం ప్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ వేడుకలో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో మార్మోగిపోయింది.కార్యక్రమంలో




విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, స్కిట్స్‌తో వినోదాన్ని పంచుకున్నారు. రంగురంగుల దుస్తులు, సంగీతం, హాస్యనాటికలు విద్యార్థులను అలరించాయి. జూనియర్లు తమ ప్రతిభను చూపించుకోవడానికి ఈ వేదికను వినియోగించుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. కనకయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కష్టపడి చదవాలని, స్నేహభావం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అధ్యాపకులు కూడా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ప్రోత్సహిస్తూ వారికి విద్యతో పాటు సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులు పరస్పరం కలిసిమెలసి చదివితే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో వాంకిడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.